

జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో
మొక్కలు నాటుతున్న ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు



జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 36లోని జీహెచ్ఎంసీ పార్కులో
మొక్కలు నాటిన కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్, పారిశుద్ధ్య కార్మికులు

# తెలంగాణ..పచ్చనిహారం

## హరితోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్

**తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా ఖైరతాబాద్ నియోజకవర్గంలో సోమవారం హరితోత్సవ కార్యక్రమాలు కనుల పండువగా నిర్వహించారు. బస్తీలు, కాలనీల్లోని పార్కులు, ఖాళీ స్థలాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో అధికారులు హరితహారం నిర్వహించి భారీగా మొక్కలు నాటారు.**

బంజారాహిల్స్/ఖైరతాబాద్,జూన్ 19:

- **వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లో..**

వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని శ్రీనికేతన్ కాలనీ పార్కులో హరితోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ మన్నె కవితా రెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ. తొమ్మిదేళ్ల క్రితం సీఎం కేసీఆర్ ప్రారంభించిన హరిత హారం కార్యక్రమం ప్రపంచంలోనే అతిపెద్ద కార్యక్రమంగా నిలిచిందన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, హరితహారం కార్యక్రమంతో తెలంగాణలో పచ్చదనం గణనీయంగా పెరిగిందన్నారు. డివిజన్ అధ్యక్షుడు రాములు చౌహాన్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలో నిర్వహించిన హరితోత్సవంలో భాగంగా భారీగా మొక్కలు నాటారు. ఆస్పత్రి సీఈవో ప్రభాకర్‌రావు, కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, నియోజకవర్గం బీఆర్ఎస్ నేత మన్నె గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- **జూబ్లీహిల్స్ డివిజన్‌లో..**

జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో హరితోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది పలు ప్రాంతాల్లోని పార్కుల్లో మొక్కలు నాటారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం 36లోని జీహెచ్ఎంసీ పార్కులో కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో యూసీడీ విభాగం అధికారి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

- ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెనటిక్స్ అండ్ హాస్పిటల్ ఫర్ జెనెటిక్ డీసీజెస్ వైద్య కళాశాలలో కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు వనం సంగీత యాదవ్ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఎస్కే అహ్మద్, నాయకులు వనం శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనికేతన్ కాలనీలో మొక్కలు నాటుతున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటుతున్న
బీఆర్ఎస్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ సంగీత యాదవ్

## వరద ముంపునకు శాశ్వత పరిష్కారం

హిమాయత్‌నగర్,జూన్19: వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారం అయ్యేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు.హిమాయత్‌నగర్ వీధి నంబర్ 14లో కొంత కాలంగా మురుగునీటి ప్రవాహం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే దానం నాగేందర్ దృష్టికి తీసుకెళ్లడంతో సోమవారం స్థానిక కార్పొరేటర్ జి.మహాలక్ష్మిగౌడ్ కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి తక్షణమే సమస్యను పరిష్కరించాలని నారాయణగూడ జలమండలి అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నారాయణగూడ జలమండలి మేనేజర్ మహేందర్‌రెడ్డి,జీహెచ్ఎంసీ ఈఈ ప్రేరాజ్,బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి సర్ఫరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సరఫరాలో లోపాలు సరిచేయండి

### జలమండలి అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు

బంజారాహిల్స్,జూన్ 19: వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని బస్తీలలోని కొన్ని వీధుల్లో మంచినీటి సరఫరాలో లోపాలను రెండు రోజుల్లో పరిష్కరించాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ జలమండలి అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, తట్టిఖానా సెక్షన్ జలమండలి మేనేజర్ రాంబాబు తదితరులతో కలిసి ఎమ్మెల్యే దానం నాగేందర్ నందినగర్, నూర్‌నగర్, వెంకటేశ్వరనగర్, ఇబ్రహీంనగర్, గురుబ్రహ్మనగర్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా తమ బస్తీల్లోని కొన్ని వీధుల్లో లో ప్రెషర్ సమస్యలు ఉన్నాయని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే జలమండలి అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. రోడ్లపై ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేయగా స్పెషల్ డ్రైవ్ చేపట్టి అక్రమ పార్కింగ్‌లను తొలగించాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రాములు చౌహాన్,మాజీ కార్పొరేటర్ భారతీనాయక్ తదితరులు పాల్గొన్నారు.



నూర్‌నగర్‌లో స్థానికుల సమస్యలు అడిగి
తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దానం నాగేందర్



ఫిలింనగర్‌లోని ఎంఆర్సీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక
పాఠశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన ఫర్నిచర్

## ప్రభుత్వ పాఠశాలలకు కొత్తరూపు

- **కార్పొరేట్ స్కూల్‌ను తలపించేలా ఎంఆర్సీకాలనీ ప్రభుత్వ పాఠశాల**
- **రూ.39లక్షల వ్యయంతో మౌలిక సదుపాయాలు**

బంజారాహిల్స్,జూన్ 19: కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రారంభించిన 'మన బస్తీ-మన బడి' కార్యక్రమంలో భాగంగా ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఫిలింనగర్ ఎంఆర్సీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కొత్త రూపు సంతరించుకుంది. పేదలు నివాసం ఉంటున్న ఫిలింనగర్ బస్తీలకు చెందిన సుమారు 260మంది విద్యార్థులు ఎంఆర్‌సీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. గతంలో సౌకర్యాల లేమితో బాధపడుతున్న ఈ పాఠశాలను ' మనబస్తీ-మన బడి' పథకానికి ఎంపిక చేశారు. రూ. 24.92లక్షల వ్యయంతో పనులు చేపట్టారు. టాయ్‌లెట్ నిర్మాణం, స్కూల్ మొత్తానికి రంగులు, వాటర్ స్టోరేజ్ కోసం 10వేల లీటర్ల ఓవర్‌హెడ్ ట్యాంక్, లైబ్రరీ , పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం, 40 ఫ్యాన్లతో పాటు లైటింగ్ ఏర్పాట్లు చేశారు. వీటితో పాటు రూ. 14లక్షలతో అత్యాధునిక ఫర్నిచర్‌ను ఏర్పాటు చేయడంతో తరగతి గదుల్లో కొత్తశోభ నెలకొంది.

## అభివృద్ధి పనులు ప్రారంభం




ఎమ్మెల్యే కాలనీలో మంచినీటి లైన్ పనులను ప్రారంభిస్తున్న
మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్,జూన్ 19: బంజారాహిల్స్ డివిజన్ పరిధిలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సోమవారం శంకుస్థాపన చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని ఎమ్మెల్యే కాలనీలోని ఏసీబీ కార్యాలయం నుంచి రమేష్ హెయిర్ కటింగ్ సెలూన్ చౌరస్తాదాకా, స్ట్రీట్ నంబర్ 1, 14 జంక్షన్, ఎమ్మెల్యే కాలనీ తదితర ప్రాంతాల్లో రూ.36లక్షల వ్యయంతో వీడీసీసీ రోడ్డుపనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. అదే విధంగా ఎమ్మెల్యే కాలనీలో రూ.8లక్షలతో వాటర్ లైన్ పనులను ప్రారంభించారు. కాలనీలో రూ.1.75లక్షల వ్యయంతో మినీమాస్ట్ లైట్లను మేయర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జలమండలి తట్టిఖానా సెక్షన్ మేనేజర్ రాంబాబుతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## రేపు యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయండి

ఖైరతాబాద్, జూన్ 19 : దేశ వ్యాప్తంగా ఈ నెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ స్పోర్ట్స్ ఫెడరేషన్ హైదరాబాద్ చైర్మన్ శ్యామ్ నటరాజ్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫెడరేషన్ అధ్యక్షుడు చతిరి బాబురావు సాగర్, ఉపాధ్యక్షులు రిషికుమార్‌తో కలిసి మాట్లాడారు. 21న నగరంలోని సరూర్ నగర్, గచ్చిబౌలి స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరుగుతాయని, అధిక సంఖ్యలో హాజరై ఆరోగ్య సమాజ నిర్మాణానికి దోహదపడాలన్నారు.

## ఉపా చట్టం కేసులన్నింటినీ ఎత్తివేయాలి

ఖైరతాబాద్, జూన్ 19 : చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కేసులన్నింటినీ ఎత్తివేయాలని నిర్బంధ వ్యతిరేక వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమర్జెన్సీ వాతావరణం నెలకొందన్నారు.

ప్రస్తుతం ఆరుగురిపైనే ఎత్తివేస్తే సరిపోదని, రాష్ట్రంలో మిగతా 146 మందిపై ఉపా చట్టం కేసులు ఎత్తివేయాలన్నారు. ఈ సమావేశంలో నిర్బంధ వ్యతిరేక వేదిక కో-కన్వీనర్లు ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం, ఎం. రాఘవాచారి, కె. రవీందర్, పద్మజా షా తదితరులు పాల్గొన్నారు.